క్లుప్తంగా

ఉచిత కంప్యూటర్ శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్: ముస్లిం విద్యార్థులకు ఉర్దూ అకాడమీలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ అకాడమీ డైరెక్టర్ అయూబ్ హుసేన్ తెలిపారు. ఆయన విలేకరులతో గురువారం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సీబీ రోడ్డులో ఉన్న ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీలో కంప్యూటర్ శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణకు హాజరయ్యే వారు పదవ తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి అనంతరం తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 9441588344, 7386588908, 8688498322 ను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

అమ్మవారి సేవలో..


అమ్మవారి సేవలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: విజయవాడలోని కనక దుర్గా, మల్లేశ్వర అమ్మవారు, స్వామివార్లను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలీసుల మాక్‌డ్రిల్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఏఆర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల మాక్‌డ్రిల్ గురువారం సైతం కొనసాగింది. కల్లూరు, ట్రాఫిక్, డీసీఆర్‌బీ, డీటీసీ, దిశ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందికి వృత్యంతర శిక్షణపై అవగాహన కల్పించారు. మూడు రోజులుగా పోలీసులకు ఇక్కడ మాక్‌డ్రిల్‌పై శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు.

యాదవులకు ఒక అసెంబ్లీ సీటును కేటాయించాలి

చిత్తూరు రూరల్: ప్రధాన రాజకీయ పార్టీలు చిత్తూరు జిల్లాలోని ఒక అసెంబ్లీ స్థానాన్ని యాదవులకు కేటాయించాలని అఖిల భారత యాదవ మహా సభ జాతీయ కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్ డిమాండ్ చేశారు. నగరంలోని సభా కార్యాలయంలో గురువారం సంఘ సభ్యులు సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో దాదాపు 4 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఒక అసెంబ్లీ స్థానాన్ని ప్రధాన పార్టీలు యాదవులకు కేటాయించాలని చెప్పారు. ఎన్నికల తరువాత నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లోనూ యాదవులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు చిట్టిబాబు యాదవ్, సురేష్ యాదవ్, కృష్ణయ్య, శ్రీనివాసులు, గోపి యాదవ్, పయణి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి స్పందన


పశువైద్య శిబిరంలో పాడి రైతులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో గురువారం ఏబీమాస్ ప్రాజెక్టు డైరెక్టర్ వినాయకం రెడ్డి, అమర ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పశువులకు పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. కొన్నింటికి పురుగుల మందు స్ప్రే చేయించారు. ఈ శిబిరాన్ని 48 మంది పాడి రైతులు సద్వినియోగం చేసుకున్నారు. పశు వైద్యులు నాగలలిత, నాయకులు కుమార్, విజయకుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్డులో పట్టుపురుగుల పెంపకం




సాగులో ఉన్న మల్బరీ తోట

జిల్లాల్లో వాణిజ్య పంటగా పేరొందిన మల్బరీ సాగుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహం అందిస్తోంది. మొక్కల నాటడానికి, షెడ్డు నిర్మాణానికి, పరికరాల కొనుగోలుకు వివిధ దశల్లో ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ఏడాదికి ఆరు పంటలు రావడం మల్బరీ ప్రత్యేకం. ఈ పట్టు గూళ్లకు మార్కెటింగ్ సదుపాయం అందుబాటులో ఉండడంతో రైతులు మంచి ఆదాయం ఆర్జిస్తున్నారు.

పట్టుకుంటే సిరుల పంట

- మల్బరీ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం
- పట్టుగూళ్లకు మార్కెటింగ్ సదుపాయం
- ఐరాల మండలంలో రెండు వేల ఎకరాల్లో సాగు


పట్టు గూళ్లను వేరు చేస్తున్న దృశ్యం

ఐరాల: వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టు సాగును విస్తరించేందుకు పట్టు పరిశ్రమ శాఖ ద్వారా రాయితీలు కల్పించడం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడం, పట్టుకు మార్కెటింగ్ సౌకర్యం మెరుగు పరచడం తదితర చర్యలు చేపట్టడంతో మండలంలో పట్టు సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం ఐరాల మండలంలో రైతులు 2 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేశారు. మల్బరీ సాగు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. కుటీర పరిశ్రమగా నిలిచిన పట్టుపురుగుల పెంపకం లాభాలకు బాటలు వేస్తున్నాయి. మల్బరీ పరికరాలను సబ్సిడీపై అందజేయడమే కాక, ఎరువులు, పలు రకాల మందులు అందజేస్తోంది. పట్టుపురుగులను పెంచేందుకు అవసరమైన షెడ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం రాయితీపై నిధులు అందజేస్తూ, రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది.

షెడ్డులో పట్టుగూళ్లు

ఎకరా నేలలో మల్బరీ తోట పెంచి ఏడాదిలో ఆరు పంటలు వస్తోంది. మల్బరీ తోటలు ఏపుగా పెరిగిన తరువాత పట్టుపురుగులు గుడ్లను (లేయింగ్స్) తెచ్చి రేరింగ్ షెడ్డులో ఉంచుతారు. గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటకు రాగానే వాటికి మల్బరీ ఆకులు మేతగా వేస్తారు. తొలుత ఆకులను సన్నగా తరిగి వేస్తారు. రానురాను పూర్తి ఆకులను పట్టుపురుగులకు మేతగా వేస్తారు. రోజుకు రెండు సార్లు మేత వేస్తారు. బాగా ఎదిగిన పట్టు పురుగులు గూళ్లు పెట్టే దశకు వస్తాయి. ఆ పురుగులను రేరింగ్ షెడ్డులోని చంద్రికల్లోకి మారుస్తారు. చంద్రికల్లో పట్టుపురుగులు గూళ్లు పెడతాయి. ఆరోగ్యకరమైన ఆకులు పురుగులకు మేతగా వేస్తే నాణ్యమైన, బరువైన పట్టుగూళ్లు వస్తాయి.

మార్కెట్‌లో గిరాకీ

ఈ విధంగా చంద్రికల్లో పురుగులు పెట్టిన గూళ్లను విడిపించి ప్రత్యేక సంచులు, వలల్లో వాటిని మార్కెట్‌కు తరలిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో పట్టుగూళ్లు కిలో రూ.400కు పైగానే ధర పలుకుతున్నాయి. అదే శీతాకాలంలో అయితే రూ.800 వరకు ధర ఉంటుంది. ఒక పంటలో 200 గుడ్లు పెంచితే తద్వారా దాదాపు 124 కిలోల పట్టుగూళ్ల వరకు ఉత్పత్తవుతాయి. ఒక పంటకు ఎకరాకు రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుండడంతో రైతులు ఈ పంటపై మక్కువ చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఆశాజనకమైన ఆదాయం పొందడానికి పట్టుపురుగుల పెంపకం ఎంతో దోహదపడుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహకం ఇలా...

పట్టు పరిశ్రమకు ఉపాధి హామీ నిధులు కేటాయిస్తోంది. గరిష్టంగా ఐదు ఎకరాల్లో ఎకరాకు రూ.18,750 సబ్సిడీ వస్తోంది. రెండెకరాలు ఉన్న రైతుకు ఈ మొత్తాన్ని మూడేళ్ల పాటు ఇస్తారు. పట్టు పురుగుల షెడ్ నిర్మాణానికి రూ.6 లక్షలు ఆర్థిక సాయం చేస్తుండగా, ఇందులో రూ. 4.17 లక్షల ఉపాధి నిధుల నుంచి ఇవ్వనున్నారు. పరికరాలకు రూ.56,250 అందిస్తున్నారు.

“ ఆదాయం బాగుంది



నేను రెండు ఎకరాల్లో మల్బరీ తోటలు సాగు చేశాను. సంవత్సరానికి 6 పంటలు తీస్తున్నాను. రెండు ఎకరాల్లో వేసిన పంటకు దాదాపు రూ.1.5 లక్షల ఆదాయం వస్తోంది. కుటుంబ సభ్యులతో కలిసి ఇద్దరు కూలీల సాయంతో పనులు చేస్తున్నాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో పట్టుపురుగుల పెంపకంతో మంచి ఆదాయం వస్తోంది.

– ఆదినారాయణ, నాగంవాండ్లపల్లె, ఐరాల

రాయితీలు వినియోగించుకోండి



పట్టు సాగు రైతులను మరింత ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సబ్సిడీలను పెంచారు. గతంలో యూనిట్ విలువ తక్కువగా ఉండేది. ప్రస్తుతం యూనిట్ విలువ పెంచడంతో రైతులు ఆసక్తిగా ముందుకు వస్తున్నారు.

– గణేష్, సెరికల్చర్ అసిస్టెంట్, ఐరాల

పోస్టర్ల ఆవిష్కరణ

చిత్తూరు కార్పొరేషన్: రైతు సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న చలో విజయవాడ పోస్టర్లను గురువారం గాంధీవిగ్రహం వద్ద నాయకులు ఆవిష్కరించారు. రాష్ట్ర రైతు సంఘం చిత్తూరు, తిరుపతి జిల్లాల కార్యదర్శులు మునిరత్నంనాయుడు, బెల్లంకొండ శ్రీనివాసులు మాట్లాడారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేలు ప్రభుత్వం సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉత్పత్తి ఖర్చులను దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగులమందులు, ఉపకరణాలను 90 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు బానిస కావొద్దు


మాట్లాడుతున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

గుడిపాల: ప్రజలెవ్వరూ దురలవాట్లకు బానిసకాకుండా, కుటుంబాలను కాపాడుకోవాలని చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి గ్రామస్తులకు సూచించారు. వసంతాపురం, కమ్మతిమ్మాపల్లె, కుప్పిగానిపల్లె గ్రామాల్లో గురువారం సాయంత్రం గ్రామసభ నిర్వహించి సైబర్‌నేరాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మద్యం అక్రమంగా రవాణా చేయడం నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులకు జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. కొంతమంది వ్యక్తులు ఫోన్‌లు చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి నమ్మించి ఓటీపీ అడుగుతారని చెప్పారు. బ్యాంకు నుంచి ఎవరికీ ఫోన్‌లు రావని సైబర్‌గాళ్ల వద్ద చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కొంతమంది విద్యార్థులు గేమ్ ఆడి డబ్బులను పోగొట్టుకుంటున్నారని జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఒంటరిగా ఉన్న ఇళ్లల్లో బంగారు, నగదును ఎక్కువగా ఉంచకూడదన్నారు. అవసరమైతే గ్రామాల్లో ఉన్న పోస్టాఫీసులో భద్రంగా దాచుకోవాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో గ్రామాల్లో ఎవ్వరూ తగాదాలకు దిగకూడదని తల్లిదండ్రులు ఈ విషయంపై పిల్లలకు తెలియజేయాలన్నారు. యువత ఎక్కువగా గంజాయి, మద్యానికి అలవాటు పడుతున్నారని దీనిపై తల్లిదండ్రులే వారిని నివారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజినీకాంత్, గ్రామపెద్దలు రెడ్డెప్ప, సాంబశివం, గ్రామస్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన


ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న ఎస్సీ కాలనీవాసులు

పూతలపట్టు: కుల, మత, వర్గ, రాజకీయాలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని పూతలపట్టు పంచాయతీ గ్రామాల్లో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ప్రజలు ఎమ్మెల్యేకు గజమాలతో ఘన స్వాగతం పలికారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు వారి సంతోషాన్ని ఎమ్మెల్యేతో పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలు అభ్యున్నతి సాధించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని తెలిపారు. సచివాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తాయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకుడు జగదీశ్వర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, సర్పంచ్ మాసిలామణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, వైస్ ఎంపీపీలు మురళీకృష్ణా, ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఐ సురేష్, కో–ఆప్షన్ మెంబరు ఖాదర్‌వలీ, లోకేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మణి, యతీష్, షణ్ముగం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం

తవణంపల్లె: సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ గీతారెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఎం.ఎస్. బాబు ప్రసంగిస్తూ సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాలన్నారు. ప్రజా ప్రతినిధుల సమావేశంలో నోరు తెరవకపోవడం బాధాకరం అన్నారు. ప్రతి సమస్యపై చర్చించడానికే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినా సభ్యులు స్పందించడం లేదని చెప్పారు. అన్ని శాఖల అధికారులు పథకాల అమలుపై గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి వారికి అందేలా చూడాలని సూచించారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా చేసి పూర్తయిన ఇళ్లకు సర్వీసులు అమర్చాలని సూచించారు. మండలంలో అర్హులైనవారికి ఇళ్ల స్థలం కేటాయించి నివాస పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో పథకాల అమలుపై సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు భారతి, వైస్ ఎంపీపీలు శోభారెడ్డి, పట్నం ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, ఎంఈఓలు హేమలత, త్యాగరాజులు రెడ్డి, వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, వైద్యాధికారులు డాక్టర్ ధాత్రేయచౌదరి, డాక్టర్ మోహన్‌వేలు, వెటర్నరీ డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువపత్రాలను అందించడానికి నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైనట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జూలైలో నియోజకవర్గంలోని 77 సచివాలయాల్లో క్యాంపులు నిర్వహించి అర్హులకు 11 రకాల ధ్రువపత్రాలను 35,368 మందికి అందించి జిల్లాలో మొదటి స్థానం సాధించామన్నారు. గతంలో నిర్వహించిన ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమం రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం వచ్చిందన్నారు. ఇందుకోసం వలంటీర్లు, గృహసారథులు చేసిన కృషి మరువలేనిదన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నగరంలో మరో 7 డివిజన్లలో కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. ఆగస్టులో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తూ పాలన సాగిస్తున్న ప్రభుత్వంపై కక్ష సాధింపు దిశగా ప్రతిపక్షాలు ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, టౌన్‌బ్యాంకు చైర్మన్ రామ్‌గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 36వ రుహాని సొందల్ షరీఫ్

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ఓబనపల్లె కాలనీలో వెలసిన ఖుదరతి చమన్ ట్రస్ట్ దర్గా ఆధ్వర్యంలో హజరత్ ఇమామ్ హాసన్ , హజరత్ ఇమామ్ హుస్సేన్ వారి 36వ రుహాని సొందల్ షరీఫ్‌ను కుదరతి చమన్ ట్రస్ట్ దర్గా పీఠాధిపతి హజరత్ పీర్ సయ్యద్ అలిషా సాహెబ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్ బాబు, చిత్తూరు నగర మేయర్ అముద, ముస్లిం మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేకమైన పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

జిల్లా క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన దివ్యాంగులు


ఐరాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ రుషీంద్రబాబు


యాదమరిలో ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరిస్తున్న ఎంఈవోలు

ఐరాల/బంగారుపాళెం/యాదమరి: జిల్లా స్థాయి దివ్యాంగుల పిల్లల క్రీడా పోటీల్లో నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు రాణించారు. వీరిలో ఐరాల భవిత కేంద్రానికి చెందిన ఎస్.రియాజ్ రెహమాన్ (10వ తరగతి) త్రో బాల్‌లో ప్రథమస్థానం సాధించగా, ద్వితీయ స్థానంలో టీ.రేవంత్ (8 వతరగతి) నిలిచారు.బంగారుపాళెం భవిత కేంద్రం విద్యార్థులు తనూష్, సుదీప్, పృథ్వి, హేమసాయి, హరికృష్ణ, సాయికృష్ణ, యువతేజ, నవ్యశ్రీ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. యాదమరి మండలానికి చెందిన దివ్యాంగులు లిఖిత త్రోబాల్‌లో మొదటి స్థానం, దీక్షిత రెండో స్థానం, స్లో వాక్‌లో అభిషేక్ మొదటి స్థానం, పరుగుపందెంలో విష్ణు ద్వితీయ స్థానం, బాలికల విభాగంలో బాంధవి ద్వితీయ స్థానం నిలిచారు. వీరందరినీ ఆయా పాఠశాలల్లో ఎంఈవోలు సత్కరించారు.

తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరం

గుడిపాల: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు స్వర్ణలతాదేవి, లక్ష్మి తెలిపారు. పానాటూరులో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కాన్పు అయిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. ఆరునెలల వయసు వరకు తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పండ్లు, గుడ్లు తీసుకోవడం వల్ల తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం స్థానిక సర్పంచ్ దీప్తిరెడ్డి గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషక ఆహార కిట్లు(టేక్ హోమ్ రేషన్)ను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కార్యకర్తలు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పౌష్టిక ఆహార కిట్లను అందించాలన్నారు. మండలంలోని కొదలమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ మాలతి, తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డి పల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ వాణీప్రియ గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఎంపీటీసీ షబీనా, సురేంద్ర, ముబారక్, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


కిట్లు అందజేస్తున్న సర్పంచ్ మధుసూదన్ రెడ్డి


కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ దీప్తిరెడ్డి

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్




గుడిపాల: వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్ హరి, ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిరుపేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు వైద్య సేవలందించారు.

గుడిపాల: ప్రతి ఇంటి ముంగిటకు వైద్యసేవలు అందజేస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి హరి అన్నారు. వసంతాపురం గ్రామంలో గురువారం 104 వైద్య సేవలందించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ముంగిటకు వైద్య సేవలను అందజేస్తున్నామన్నారు. 60 మంది రోగులకు బీపీ, షుగర్, గర్భవతులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్యసేవలు చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జబసెల్వి, సుజిమ, ఉమామహేశ్వరి, ప్రవీణ్, మార్కొండయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

చిత్తూరు కలెక్టరేట్: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న ఏపీ ఎన్జీవో 21వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు, కార్యదర్శి రఘు కోరారు. ఆ సంఘం జిల్లా కార్యాలయంలో గురువారం రాష్ట్ర మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 21, 22 తేదీల్లో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మురళి, బాలసుబ్రహ్మణ్యం, మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎన్జీవో సంఘం నాయకులు